క్లుప్తంగా

వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించండి

సామర్లకోట: దివంగత నేత డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమంతోపాటు పలు సేవా కార్యక్రమాలు మంగళవారం పట్టణంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం జగనన్న కాలనీ నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. జగనన్న కాలనీ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. పెద్దాపురం మున్సిపల్ సెంటర్, ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం, రాజీవ్ గృహకల్ప, ఫ్లైఓవర్ బ్రిడ్జిలపై ఉన్న వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సోషల్ మీడియా కన్వీనర్లు అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

ఆదినారాయణ మృతి కళాకారులకు తీరని లోటు

పెద్దాపురం: పట్టణ ప్రముఖ సంగీత విద్వాంసుడు పెనుమర్తి ఆదినారాయణ మృతి సంగీత ప్రియులకు, కళాకారులకు తీరని లోటని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలో ఆదినారాయణ సంతాప సభ సోమవారం పట్టణ సంఘం నాయకులు కొమ్మన అమ్మన్న అధ్యక్షతన నిర్వహించారు. ఆదినారాయణ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన తనయులు మధు, ప్రసాద్‌ను నాయకులు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, పీసీసీ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ, సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు సుందరపల్లి గోపాలకృష్ణ, గుడివాడ సింహాచలం, నాయి బ్రాహ్మణ సోదరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకోండి



కార్మికులకు వెల్ఫేర్ బోర్డు గుర్తింపు కార్డులు అందజేస్తున్న నాయకులు

పిఠాపురం: భవన నిర్మాణం సంక్షేమ బోర్డులో ఎలక్ట్రికల్ కార్మికులు పేర్లు నమోదు చేయించుకోవాలని ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు వియ్యపు రమణరాజు పిలుపునిచ్చారు. పిఠాపురంలో సోమవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డ్ గుర్తింపు కార్డులు కార్మికులకు అందజేశారు. ఉపాధ్యక్షుడు సురవరపు గణేష్, ప్రధాన కార్యదర్శి బండారు నాగ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

15న రాష్ట్ర లేబర్ కార్యాలయ ముట్టడి

పిఠాపురం: విజయవాడలో సెప్టెంబర్ 15న రాష్ట్ర లేబర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్మాణరంగ కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి నందీశ్వరుడు పిలుపునిచ్చారు. సోమవారం చేబ్రోలులో నిర్వహించిన సీతారామ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని, 12 14 జీఓను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ నెల 15న విజయవాడ రాష్ట్ర లేబర్ ఆఫీస్ ముట్టడిని కార్మికులందరూ జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.రమణ, టి.రవిబాబు పాల్గొన్నారు.

నేత్రదానం చేయండి

ప్రత్తిపాడు: జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌సీ వద్ద ఈ ర్యాలీని సూపరింటెండెంట్ సౌమ్య మైఖేల్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, నేత్ర దానం చేయడం ద్వారా ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చన్నారు. వయసుతో సంబంధం లేకుండా బీపీ, డయాబెటీస్ ఉన్నా సరే నేత్ర దానం చేయవచ్చన్నారు. కంటిలో నల్లగుడ్డు సమస్యలతో బాధపడేవారికి నేత్ర దానం చేయడం వల్ల చూపును అందించవచ్చని పేర్కొన్నారు. వ్యక్తి మరణించిన అరగంట నుంచి గంటలోపు కుటుంబీకులు సమాచారం అందిస్తే సిబ్బంది వచ్చి నేత్రాలు సేకరిస్తారని తెలిపారు. ఈ ర్యాలీలో సీహెచ్‌సీ వైద్యులు వినీల, రఘురామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడిపై సచివాలయ ఉద్యోగిని ఫిర్యాదు

ప్రత్తిపాడు: ధర్మవరానికి చెందిన వృద్ధుడిపై సోమవారం ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ధర్మవరం సచివాలయ ఉద్యోగిని తుర్రం రాధిక పింఛన్ల పంపిణీలో భాగంగా జగన్నాథరాజు చిరునామా కోసం రామరాజు (86)ని అడిగారు. ఇదే నివాసమంటూ తనను లోపలికి రమ్మంటూ అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ చేపడతామని స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం చెప్పారు.

శునకాల స్వైరవిహారం

- వీధుల్లో గుంపులుగా సంచారం
- ప్రయాణికులకు ప్రాణసంకటం
- పెరుగుతున్న కుక్క కాటు బాధితుల సంఖ్య
- నివారణ చర్యలు శూన్యం



పిఠాపురంలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి శునకాలు



వీధి కుక్కలను నివారించాలని అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మన ఊరు, మన బాధ్యత సభ్యులు

పిఠాపురం: గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి. దొరికిన వారందరిపైన అవి దాడులు చేస్తున్నాయి. ఫలితంగా అనేక మంది కుక్కకాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో వైద్య కోసం ఎదురుచూస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీలో యాంటీ రేబిస్ ఇంజెక్షన్లు అరకొరగా ఉంటున్నాయి. అధికారులు వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. పాలకులు, అధికారులు ప్రాణాంతకమైన ప్రాణాంతక వ్యాధిని కలిగించే కుక్క కాటుపై నివారణా చర్యల వైపు దృష్టి సారించకుండా కేవలం యాంటీ రేబిస్ ఇంజక్షన్లపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు.

యాంటీ రేబిస్ ఇంజక్షన్ల కొరత

పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో వివిధ గ్రామాల్లో కుక్కల బెడద రోజురోజుకీ పెరిగిపోతోంది. జిల్లాలో అనేక మంది కుక్కకాటుకు గురై మృత్యువాత పడ్డారు. ఎవరైనా కుక్కకాటుకు గురై ప్రాణాపాయ స్థితికి చేరినప్పుడు హడావుడి చేసిన అధికారులు అనంతరం పట్టించుకోవడం లేదు. ప్రతి రోజూ కుక్కకాటుకు గురయ్యేవారి సంఖ్య అధికమవుతోంది. నియోజకవర్గ పరిధిలో ప్రతిరోజూ 35 పైగా కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. పిఠాపురంలోని సీహెచ్‌సీ, కొత్తపల్లి, విరవ, గొల్లప్రోలు, కొమరగిరి, పీహెచ్‌సీలోల యాంటీ రేబిస్ ఇంజక్షన్ల కొరత కలవరపెడుతోంది. ప్రభుత్వాస్పత్రిల్లో ఇంజెక్షన్లు సక్రమంగా లభ్యంకాక కొందరు ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తోందని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో డాక్టర్లు కేవలం సూచనలు, సలహాలు ఇవ్వడమే తప్ప వైద్య సేవలందండం లేదని బాధితులు వాపోతున్నారు.

ఆపరేషన్ చేస్తే కరవడం మానేస్తాయా..?

శునకాలకు గర్భనిరోధక చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామంలోనూ శునకాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏ వీధిలో చూసిన కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా నివారణ చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కుక్కలను సంహరించ కూడదన్న నిబంధనలు ఉండడంతో సుమారు ఐదేళ్ల నుంచి వాటి నివారణకు చర్యలు తీసుకోలేదని అధికారులు అంటున్నారు. వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ కనిపించిన వారిపై దాడికి దిగుతున్నాయి. ప్రస్తుతం కుక్కకాటు ప్రాణాంతకం అవుతుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీలు కుక్కల నివారణకు ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

నియోజకవర్గంలో ఆస్పత్రులు

సీహెచ్‌సీ	-	1
యూపీహెచ్‌సీలు	-	3
పీహెచ్‌సీలు	-	7
వీధి కుక్కలు	-	35వేలకు పైగా
కుక్క కాటు బాధితులు	-	నెలకు సుమారు 300

వీధి కుక్కలను నివారించండి

వీధుల్లో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎక్కడ చూసినా గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. అనేక మంది కుక్క కాటు బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం వీధి కుక్కల నివారణకు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఇక్కడ కూడా తగిన చర్యలు తీసుకుని వాటిని నివారించాలి. ప్రతి రోజు పిఠాపురంలో పది మందికి పైగా కుక్కకాటుకు గురవుతున్నారు. వీధి శునకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పిఠాపురం గ్రీవెన్సులో వినతిపత్రం అందజేసాం.

– కొండేపూడి శంఖర్రావు, పిఠాపురం

ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న శేషు బాబ్జీ

పిఠాపురం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చాకా కూటమి నేతలు పట్టించుకోడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.శేష బాబ్జి విమర్శించారు. స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో సోమవారం జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు అండ్ హెల్పర్ల యూనియన్ పిఠాపురం ప్రాజెక్టు మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలల గడుస్తున్నా నేటికీ సమస్యల పరిష్కరించడంలో, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి, సీఐటీయూ మండల కార్యదర్శి కుంచే చిన్న మాట్లాడుతూ పనిచేయిని స్మార్ట్ ఫోన్ చేతికిచ్చి అనేక యాప్‌లను వినియోగించాలంటూ ఆదేశాలివ్వడంతో ఫోన్లు మొరాయిస్తున్నారని అన్నారు. పని చేయని ఫోన్లను అధికారులకు అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా పిఠాపురం ప్రాజెక్ట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దడాల పద్మ, కుంచే చిన్న, అధ్యక్ష కార్యదర్శులుగా జి.విజయశాంతి, డి.తులసిదేవి, కోశాధికారిగా రామలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా నళిని, డి.సత్యవతి, ఆర్ బేబీ, గంగా లక్ష్మి, సహాయ కార్యదర్శులను ఎన్నుకున్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమార రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు భాద్రపత మాసం, నవమి సోమవారం కావడంతో ఆలయంలోని కుమార రామభీమేశ్వరస్వామికి, బాలాత్రిపుర సుందరి అమ్మ వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉప ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి, అమ్మ వారిని దర్శించుకున్నారు. స్వామి వారి తొలి అభిషేకాన్ని క్యూలైనులో భక్తులు వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలోని నీటితో అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. పూజలు అనంతరం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో, గొంచాలలోని శివాలయంలో, పీబీ దేవం శివాలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గణేశ్ నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు



పిఠాపురంలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పిఠాపురం: ఈనెల 6,7 తేదీల్లో నగర గణేశ్ ఉత్సవ సమితి, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామూహిక గణపతి విగ్రహాల నిమజ్జనోత్సవానికి తరలిరావాలని, ఉత్సవ మండపాల నిర్వాహకులను సమితి సమితి సభ్యులు సోమవారం పలు గ్రామాల్లో పర్యటించి ఆహ్వానించారు. నగర గణేశ్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాలకొండయ్య గౌరవాధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, సలహాదారు దువ్వూరి సుబ్రహ్మణ్యం, సమరసతా సేవ ఫౌండేషన్ కాకినాడ ఖండ కన్వీనర్ కరెడ్ల చక్రి, చిట్టా మధు, కామర్స్ చిరంజీవి సింగిలిదేవి సత్తి రాజు మలిరెడ్డి నారాయణ రావు నేతృత్వంలో పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు మండలంలో ఏర్పాటు చేసిన పలు మండపాలను సందర్శించి సామూహిక నిమజ్జనోత్సవానికి తరలి రావాలని ఆహ్వాన పత్రాలను అందజేశారు.

ఏర్పాట్లు చేయాలని వినతి

కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు వినాయక నిమజ్జనాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ నగర గణేశ ఉత్సవ సమితి సభ్యులు పిఠాపురం నియోజకవర్గ వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బుర్రి మురళీధర్ ఆధ్వర్యంలో సోమవారం అధికారులకు వినతిపత్రాలు అందజేసారు. ఉప్పాడ సాగర తీరం, పిఠాపురం. గొల్లప్రోలు పీబీసీ, ఏలేరు కాలువల వద్ద నిర్దేశించిన ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు వారు విజ్ఞప్తి చేసారు.

గొప్ప ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ



తుని ఎల్ఐసీ కార్యాలయంలో వారోత్సవాలను ప్రారంభించిన దృశ్యం

తుని: ఎల్ఐసి దేశంలోనే గొప్ప ఆర్థిక సంస్థగా ఎదిగిందని తుని ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో 69వ జీవిత బీమా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి పాల్గొని, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జీవిత బీమా అనేది పాలసీదారుల నమ్మకం అని, ఎన్నో కుటుంబాలకు ఆర్థికంగా సాయపడుతుందన్నారు. పాలసీదారుల సేవలో ఎల్ఐసీ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్ఐసి అనేది ప్రతి ఒక్కరికీ అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సందీప్ శోభన్ కుమార్, ఆఫీసు సిబ్బంది, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఆవిర్భావ వేడుకలు

గోకవరం: గ్రామంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బ్రాంచ్ మేనేజర్ డీఎస్వీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కొండలరావు హాజరయ్యారు. బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ 1956 సెప్టెంబర్ 1న రూ.5 కోట్లతో ప్రారంభించిన ఎల్ఐసీ సంస్థ ప్రస్తుతం రూ. 57 లక్షల కోట్ల ఆస్తులు కలిగి, 30 కోట్ల పాలసీదారులతో ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. ఈ వారోత్సవాలు ఏడు రోజులు జరుగుతాయని, విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీఎం విజయ్ కోటేశ్వరావు, ఆఫీసర్లు ఎలిపే శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యను దూరం చేస్తే ఉద్యమిస్తాం



కళాశాల యాజమాన్య తీరుపై అఖిల భారత విద్యార్థి సభ్యుల నిరసన

తుని: డిగ్రీలో బీకాం గ్రూపు ఉందని విద్యార్థులను కళాశాలలో చేర్పించుకొని, ఇప్పుడు కోర్సు లేదంటూ వారిని విద్యకు దూరం చేస్తే ఉద్యమిస్తామని అఖిల భారత విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ చందు అన్నారు. సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తుని శాఖ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో యాజమాన్యం డిగ్రీ మొదటి ఏడాది విద్యార్థులకు విద్యను దూరం చేయాలనుకుటున్న నేపథ్యంలో కళాశాల యాజమాన్య తీరుపై నిరసన తెలిపారు. చందు మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులను బీకాం కంప్యూటర్స్ గ్రూప్ ఉందని చేర్పించుకున్నారన్నారు. రెండు నెలలు గడిచిన తర్వాత ఇప్పుడు ఆ గ్రూప్ తొలగిస్తున్నామని మేనేజ్‌మెంట్ ప్రకటించిందన్నారు. ఈ విషయంపై గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్లి అడిగినా కళాశాల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ వ్యవహారంపై కళాశాల యాజమాన్యం స్పందించకుంటే ఉద్యమిస్తామన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పింఛన్ల పంపిణీపై అధికారుల నిర్లక్ష్యం



కొండెవరంలో ద్విచక్ర వాహనం దిగకుండా లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి



వాకతిప్పలో ప్రభుత్వ కార్యాలయం వద్ద రోడ్డుపైనే పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి



వాకతిప్పలో లబ్ధిదారుడికి గ్రామ సచివాలయం వద్ద పింఛను అందిస్తున్న ఉద్యోగి

కొత్తపల్లి: లబ్ధిదారులు పింఛన్లు అందుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను అమలు చేసింది. వలంటీర్ల ద్వారా పింఛన్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందించేందుకు ఏర్పాట్లు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసారు. లబ్ధిదారులకు పింఛన్లు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పింఛను లబ్ధిదారులు సోమవారం పింఛను అందుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. పింఛను దారులను ఒక చోటకు రమ్మని అక్కడే పింఛన్లు ఇవ్వడం, ఫోన్లు చేసి సచివాలయాలకు రమ్మని పిలిచి పింఛన్లు పంపిణీ చేయడంతో వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ హరికృష్ణారెడ్డిని దీనిపై వివరణ కోరగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందని అన్నారు. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

పెద్దాపురం: మాదవ ద్రవ్యాలు, ర్యాగింగ్ వంటి చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని పెద్దాపురం సీఐ విజయ్‌శంకర్ అన్నారు. దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్సై మౌనిక అధ్యక్షతన సోమవారం మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ రహదారి భద్రదతలపై అవగాహన సదస్సు నిర్వహించారు,. ఈ సందర్భంగా సీఐ విజయశంకర్ మాట్లాడుతూ శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణకు సామూహిక కార్యక్రమం

సామర్లకోట: పంటలకు నష్టం కలిగిస్తున్న ఎలుకల నివారణకు నియంత్రణకు 3వ తేదీన సామూహికి కార్యక్రమం నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయశాఖ విస్తరణాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకుల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రైతు సేవాకేంద్రాల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పరిధిలో 101 కిలోల ఎలుకల నివారణ మందులను 1,015 ప్యాకెట్లు తయారు చేసి రైతులకు అందిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు డివిజన్‌లో ఆయా మండలాల నుంచి నాలుగు అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



పొన్నాడలో గ్రామ సభ పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు పథకాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని ఆయన అన్నారు.ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత ఆదేశంతో మండలంలోని పొన్నాడ శ్రీరాంపురం, రమణక్కపేటలో సోమవారం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంబాల యాకబ్, కడారి సతీష్, పెనుమల్లు పాపిరెడ్డి ఆధ్వర్యంలో ×బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ× కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలులో పార్టీల పేరుతో వివక్ష చూపరాదని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కారే శ్రీనివాసరావు, జ్యోతుల బాబులు, కాదులూరి నేరేళ్లరెడ్డి, యాదల నాగేంద్ర, కారే కిరణ్, బండి సత్తిబాబు, కొయ్య స్వామి, యాదల శివ, కాళ్ల గోవిందు, మెరుగు ఆనందరావు, చెట్లూరి రాము, సాక చిన్నబ్బాయి, మేక నాని పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనాలు



గణనాథుడి ఊరేగింపు



సాగర తీరంలో గణేశ్ నిమజ్జనం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: గణపతి నవరాత్రులు సందర్భంగా ఉప్పాడ, పొన్నాడ శివారు కొనపాపపేట సాగర తీరం గణనాథుని నిమజ్జనాలతో సోమవారం కళకళలాడింది. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సాగరంలో నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిమజ్జనోత్సవంతో సాగరతీరం నిండిపోయింది. మండలంలో పలు గ్రామాల్లో ఉన్న వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణాసంచా కాల్పులతో ఊరేగించారు. ఉప్పాడ సముద్రంలో మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై వినాయకుని ప్రతిమలను ఊరేగింపుగా భజనలు, నృత్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా తీసుకొచ్చి భక్తులు సాగరతీరంలో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.

15వ వార్డులో అన్న సమారాధన

సామర్లకోట: స్థానిక 15వ వార్డు మట్టపల్లి వారి వీధి శ్రీబాల వరసిద్ధి వినాయకుడి మందిరం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యర సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, అయ్యరక కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, కౌన్సిలర్ జట్ల మోహన్ ప్రారంభించారు. ఆ వార్డులో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు కమిటీ నాయకులు తెలిపారు. ఐదు అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతి రోజు పూజలు నిర్వహిస్తున్న కమిటీ నాయకులను ఆవాల లక్ష్మీనారాయణ దంపతులు అభినందించారు. అన్నదాన కార్యక్రమానికి తన వంతు సహాయంగా రూ.ఐదు వేలు విరాళాన్ని లక్ష్మీనారాయణ అందజేశారు. సుమారు నాలుగు వేల మందికి అన్నదానం చేసిన్నట్లు కమిటీ నాయకులు తెలిపారు.